క్లుప్తంగా

విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి బోధించాలి



నర్సిపల్లెలో విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ: ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి బోధన చేయాలని ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని నర్సిపల్లె గ్రామంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయుడు శివారెడ్డికి సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం

శిరివెళ్ల: యర్రగుంట్ల విమలా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం పాఠశాల హెచ్‌ఎం అన్నాగ్రేస్ మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీ ఆళ్లగడ్డలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన అతీక్, సుమంత్ సత్తాచాటారని తెలిపారు. ఈ నెల 26,27 తేదీల్లో నందికొట్కూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను అభినందించారు.

ఒప్పందాలను రద్దు చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం గౌతమ్ అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని గాంధీచౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అవినీతితో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్న గౌతమ్ అదానీని అరెస్ట్ చేయాలని, ప్రజల సంపదను కాపాడాలని కోరారు. సీపీఎం సీనియర్ నాయకులు తోటమద్దులు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు మహమ్మద్‌గౌస్, వెంకటలింగం, శివ, జైలాన్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): గురుపూజోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్న నంద్యాల మండలం పుసులూరు గ్రామ ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రేమ్‌కాంత్ కుమార్‌ను సహచర ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు శనివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి అవార్డు అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామ పెద్దలు ఆయనను సత్కరించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న స్పెషల్ ట్రైనర్

రుద్రవరం: వ్యక్తిత్వ వికాసంపై ట్రైనర్ సలీం విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పర్సనాలిటీ డెవలెప్‌మెంట్‌పై ఒక్క రోజు అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలన్నారు. కష్టపడకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరం శివారులోని దుర్వి నరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు ప్రొద్దుటూరుకు చెందిన నారాయణ, నంద శ్రీహరి, నంద పార్థసారథి తండ్రి నారాయణ పుల్లయ్య జ్ఞాపకార్థం రూ. 25,116 విరాళం అందజేశారు.

ఆ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పాఠశాలల పని వేళల పెంపు ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజా, ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు విరామంతో కలిసి 7గంటలుగా పని దినం ఉండేదన్నారు. ఉత్తమ విద్యకు పేరుగాంచిన ఫిన్‌లాండ్‌లో 6గంటల పని దినం అమలవుతోందన్నారు. హరివర్ధన్, కిశోర్, శివ, కుమార్, హర్ష పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప

- విరాజిల్లుతున్న చాగలమర్రి అయ్యప్పస్వామి ఆలయం
- ఏక శిల పదునెట్టాంబడి నిర్మాణం
- శబరిమలై వెళ్లలేని భక్తులు ఇక్కడే ఇరుముడి విప్పే అవకాశం
- ఏటా కార్తీక మాసంలో అన్నదానం




చాగలమర్రి అయ్యప్పస్వామి ఆలయం,(ఇన్‌సెట్)స్వామివారి మూలవిరాట్ విగ్రహం

చాగలమర్రి: నంద్యాల జిల్లా చాగలమర్రి చెన్నకేశవస్వామి ఆలయానికి సమీపంలో 1999లో నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో ఏటా కార్తీక మాసంలో విశేష పూజలు జరుగుతాయి. అప్పట్లో రూ.50 లక్షల భక్తుల విరాళాలతో రాజస్థాన్ గ్రానైట్ రాళ్లతో నిర్మించారు. ఈ ఆలయ నిర్మాణానికి తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లో ఎక్కడా లేని విధంగా ఏక శిల పదునెట్టాంబడితో సర్వాంగ సుందరంగా, ప్రశాంతమైన వాతవరణంలో స్థానిక ఆర్యవైశ్యులు నిర్మించారు. ఈ ఆలయాన్ని 1999 మే 2వ తేదీ శబరిమలై సన్నిధాన ప్రధాన అర్చకులు కంఠరారు మోహనారు, పందళదేశపు ప్రస్తుత రాజ వంశీయులు రాజరాజ వర్మ, వేద పండితులు వెంకటశేష్యయ్య శిష్య బృందం గర్భగుడి, అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ గావించారు. ఈ ఆలయ విశిష్టత ఏంటంటే అయ్యప్పస్వామి మాల ధరించి 42 రోజుల దీక్ష పూర్తి చేసిన భక్తులు శబరిమలైకి వెళ్లలేని పరిస్థితుల్లో ఇక్కడే ఇరుముడి విప్పి స్వామిని దర్శించుకునే అవకాశం ఉంది. ఇలాంటి విశిష్టత కలిగిన ఆలయాలు మన రాష్ట్రంలో గుంటూరు జిల్లాలోని ద్వారంపూడి తరువాత చెప్పుకోదగిన ఆలయం చాగలమర్రిలోని అయ్యప్పస్వామి ఆలయం. ఏటా కార్తీకమాస ప్రారంభం నుంచి అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమంతో పాటు ప్రత్యేక వసతులను అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో కల్పిస్తున్నారు. ఈ ఏడాది కూడా కార్తీకమాసం ప్రారంభం నుంచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



పడి పూజకు ముస్తాబైన ఏకశిలా పదునెట్టాంబడి, (ఇన్‌సెట్) అన్న ప్రసాదం స్వీకరిస్తున్న అయ్యప్ప భక్తులు

ఏటా 200 మంది మాలధారణ



ఇప్పటికి 26 సార్లు అయ్యప్ప స్వామి మాలధారణ చేసి ఇరుముడితో శబరిమలైకి వెళ్లా. ప్రతి ఏడాది చాగలమర్రిలోని అయ్యప్పస్వామి ఆలయంలో నంద్యాల, వైఎస్సార్ జిల్లా పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు 200 మంది వరకు అయ్యప్ప మాల వేస్తారు. వీరికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తాం. మాలధారుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

–వందవాసి నాగేశ్వరరావు, గురుస్వామి

60 రోజులు భోజన వసతి కల్పిస్తాం



ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా మాలధారణ చేసిన భక్తులకు కార్తీక మాసం ప్రారంభం నుంచి 60 రోజులపాటు అన్నదానం చేయనున్నాం. జనవరి 15వ తేదీ వరకు సుమారు 50 వేల మంది భక్తులు అన్నదానం స్వీకరిస్తారని అంచనా. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

–లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి, అయ్యప్పా సేవా సమాజం

మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జడ్జి వాసు,



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ

నంద్యాల(వ్యవసాయం): డిసెంబర్ 14వ తేదీన జరిగే మెగా జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌ల ప్రకారం రాజీ కాగల కేసుల్లో కక్షిదారులను ప్రోత్సహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎక్సైజ్, పెట్టి, కుటుంబ కలహాలు, ఎంసీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రాజీ కాగల కేసుల గురించి ఆరా తీశారు. వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, తాలూకా, ట్రాఫిక్ సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి ఉమాదేవి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

ఆళ్లగడ్డ: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా డిసెంబర్ 14వ తేదీ నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సమష్టిగా విజయవంతం చేద్దామని ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడమే లక్ష్యంగా పోలీస్, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులతో పాటు వాహన ప్రమాదం, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాల వంటి కేసులను పరిష్కరించుకోవచ్చని కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. నియోజకవర్గంలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నంద్యాల(న్యూటౌన్): 108 ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ పట్టణంలోని భగత్‌సింగ్ కార్యాలయంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. సమావేశానికి 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేషయ్య, జీవన్ అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, బాలవెంకట్ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ సంబంధిత యాజమాన్యాం పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఈనెల 26న జరిగే సమ్మెకు రాజకీయ పార్టీల సంఘాలు, కార్మిక సంఘాలు, 108 ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దినేష్, ప్రవీణ్, వెంకటేశ్వర్లరెడ్డి, హుసేన్‌వలి, జుబేర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు



అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లోని శ్రీలక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి, అభయాంజనేయస్వామి, శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. అర్చకులు అనంతయ్య, కమలేష్‌శర్మ, భాస్కరశర్మ, లక్ష్మణస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి



బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న ఈఆర్ఓ కొండయ్య,



ఓటు నమోదుకు దరఖాస్తును స్వీకరిస్తున్న తహసీల్దార్

నంద్యాల(అర్బన్): 18ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలని నంద్యాల నియోజకవర్గ అధికారి కొండయ్య తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో బీఎల్‌ఓల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రియదర్శినితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్‌ఓలు క్లయిమ్స్‌తో అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. ఆదివారం సాయంత్రం వరకు నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పెషల్ క్యాంపెయిన్‌లో వచ్చిన అభ్యంతరాలను డిసెంబర్ 24వ తేదీలోగా పరిష్కరించి 2025 జనవరి 6న ఫైనల్ పబ్లికేషన్ రానుందని చెప్పారు. ఎన్నికల డీటీ శేఖర్ ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

శిరివెళ్ల: మండలంలో శనివారం ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ పుష్పకుమారి స్థానిక పోలింగ్ కేంద్రాలు, బూత్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ నెల 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక సవరణ కార్యక్రమం జరుతుందన్నారు. కొత్త ఓటు హక్కు కోసం 14 అర్జీలు, ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పుల కోసం 12 దరఖాస్తులు అందాయన్నారు. ఆదివారం సెలవుయినప్పటికి నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

ఉయ్యాలవాడ: మండలంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు తనిఖీ చేశారు. పడిగెపాడు గ్రామంలో 15, హరివరం గ్రామంలో 6,7 పోలింగ్ స్టేషన్లను పరిశీలించి ఓటర్ల జాబితాలో తప్పులు, అక్షర దోషాలు లేకుండా పేర్లు నమోదు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఫారం 6లో 18 మంది, ఫారం –7లో 2, ఫారం 8లో 12 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన నంద్యాల మండల కార్యవర్గం

నంద్యాల(అర్బన్): పీఆర్‌టీయూ నంద్యాల మండలం నూతన కార్యవర్గం ఎంపికను స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి ఎన్నికల అధికారిగా నిర్వహించిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడిగా దస్తగిరి, కార్యదర్శిగా అబ్దుల్‌కలాం, ఉపాధ్యక్షుడుగా సురేష్ బాబు, మహిళా ఉపాధ్యక్షురాలిగా హసీనాబేగం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా విశ్వనాథయ్య, కార్యదర్శులుగా ప్రహ్లాద, హైమావతి, జిల్లా కౌన్సిలర్లుగా కరీముల్లా, జాకీర్‌హుసేన్, ప్రేమ్‌కుమార్, రఘునాథ్, సుధాకర్‌ను ఎంపిక చేశారని నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరరెడ్డి తెలిపారు.

గోస్పాడు : పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికల అధికారిగా జేఏసీ చైర్మన్ కృష్ణారావు, ఎన్నికల పరిశీలకుడుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు శనివారం తెలిపారు. మండల అధ్యక్షుడుగా భాస్కరుడు, ప్రధాన కార్యదర్శిగా సురేష్ శర్మ, ఉపాధ్యక్షుడుగా సుబ్బరాయుడు నాయక్, మహిళా ఉపాధ్యక్షురాలిగా షేక్ సాజిదా పర్వీన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులుగా హబీబుల్లా, సికిందర్ ఆజాద్,మహిళా కార్యదర్శిగా సుమలత, జిల్లా కౌన్సిలర్లుగా బైరెడ్డి రాజశేఖరరెడ్డి, షరీక్ బాబు, శ్రీనివాసులును ఎంపిక చేశారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మహానంది: మహానందీశ్వరుడి దంపతులకు నిత్య కల్యాణోత్సవంలో భాగంగా శనివారం కల్యాణ మహోత్సవం కనులపండుగగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతు శర్మల ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో కల్యాణ మహోత్సవం వేదోక్తంగా చేపట్టారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి స్థానిక యాగశాలలో మహానందీశ్వర దంపతులకు ఏకాంత సేవ పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు.

తాగునీటి పథకం పరిశీలన



తాగునీటిని పరిశీలిస్తున్న ఈఈ మనోహర్

నంద్యాల(అర్బన్): మండలంలోని కొత్తపల్లె గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్ శనివారం పరిశీలించారు. ఈఈ మనోహర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటైన తాగునీటి పథకాలను అంగన్‌వాడీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించాచారు. జిల్లాలో 425 అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీటి వసతి కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. 390 కేంద్రాల్లో నీటి సరఫరా పనులు పూర్తయ్యాయని, 33 కేంద్రాలకు సంబంధించిన తాగునీటి పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే 231 కేంద్రాలకు మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి నిధులు మంజూరు కాగా 191 కేంద్రాల్లో పనులు పూర్తయ్యాయని, 40 కేంద్రాల్లో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.



బోడెమ్మనూరులో పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏఓ,



పెద్దయమ్మనూరులో రైతులకు అవగాహన

వరిలో పంట కోత ప్రయోగాలు

ఉయ్యాలవాడ: మండల పరిధిలోని బోడెమ్మనూరు గ్రామంలో ఖరీఫ్‌లో సాగు చేసిన వరిలో పంట కోత ప్రయోగాన్ని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు బావిరెడ్డి వెంకటరామసుబ్బారెడ్డికి చెందిన పొలంలో 5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం చేపట్టారు. 14.250 కేజీలు దిగుబడులు వచ్చాయి. ఎకరాకు 31 బస్తాలు దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. గత ఏడాది వరి సాగు చేసిన రైతులు 42 నుండి 45 బస్తాల వరకు దిగుబడులు పొందారన్నారు. వారం క్రితం తుపాన్ ప్రభావంతో వరి నేలవాలి దిగుబడులు తగ్గాయన్నారు. ప్రస్తుతం మళ్లీ వాతావరణ శాఖ ఈ నెల 26,27 తేదీల్లో తుపాన్ సూచన ఉన్నట్లు వెల్లడించింది. వరి సాగు చేసిన రైతులు పంట పూర్తయింటే వెంటనే నూర్పిడిలు చేసుకోవాలని సూచించారు. అలాగే పెద్దయమ్మనూరు గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్, ప్రభుత్వం నుంచి పరిహారం అందాలంటే తప్పనిసరిగా బీమా ప్రీమియం మీ సేవా, సీఎస్‌సీ కేంద్రాల్ల చెల్లించాలన్నారు. కంది, శనగ, మినుము పంటల్లో సోకిన వేరుకుళ్లు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తీసుకుని క్రిమి సంహార మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సునీత, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలి



క్రిష్టిపాడులో పంటలబీమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని రైతులు రబీ సీజన్‌లో పంటలకు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మండంలోని క్రిష్టిపాడు గ్రామంలో పంటల బీమా పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల బీమా, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పంటలవారీగా మొత్తాలను చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు. గ్రామాల యూనిట్‌గా శనగ పంటకు ఎకరానికి రూ. 84, మండల యూనిట్‌గా జొన్నకు రూ.59, మినుముకు రూ.48, వరికి రూ.126, జిల్లా యూనిట్‌గా వేరుశనగకు రూ.64, ఉల్లికి రూ.90 ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. శనగ, మినుము, జొన్న, ఉల్లి పంటలకు డిసెంబర్ 15వ తేదీ వరకు, వరికి మాత్రం డిసెంబర్ 30 వరకు గడువు ఉందని తెలిపారు. పొలం, బ్యాంకు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, ఈ–క్రాప్ బుకింగ్ సర్టిఫికెట్ మీసేవలో ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీ లిమిటెడ్ సంస్థకు ప్రీమియం చెల్లించాలన్నారు.

చేపల పుల్లమ్మ మృతి



సూరటి పుల్లమ్మ(ఫైల్)

దొర్నిపాడు: ఆమె అసలు పేరు సూరటి పుల్లమ్మ..అందరూ పిలుచుకునే పేరు చేపల పుల్లమ్మ. అయితే ఏంటీ అనుకుంటున్నారామో. ప్రస్తుత కాలానికి ఆమె గొప్ప జీవనాన్నే గడిపిందనే చెప్పుకోవాలి. ఎందుకంటే పుల్లమ్మ(100) వందేళ్లు జీవించి శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన పుల్లమ్మ శతాధిక వృద్ధురాలుగా పేరుగాంచారు. చేపల అమ్ముకుంటూ జీవనం సాగించే ఆమెకు ఐదుగురు కూతుళ్లు, ఇద్దరు కొడుకుల సంతానం. నిత్యం జొన్న, రాగి సంగటి, రొట్టెలతో పాటు మాంసానికి బదులుగా చేపల పులుసును అధికంగా తినేదని కుమారుడు గురుస్వామి పేర్కొన్నారు. రెండేళ్ల నుంచి కూడా ఆమెకు రాగిగంజినే తాపేవారు. అవుకు మండలం సంగపట్నంలో 1924 నవంబర్ 6న జన్మించినట్లు చెప్పారు.

రస్తా విషయంలో ఘర్షణ

- ముగ్గురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న భార్గవ నరసింహులు

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామంలో రస్తా విషయమై శనివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహులు, భార్య సుబ్బలక్ష్మీ, కుమారుడు భార్గవ నరసింహులుపై అదే గ్రామానికి చెందిన డేరంగుల లక్ష్మీనరసింహుడు ఇనుప రాడ్డుతో దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక కేరళ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తలరించారు. లక్ష్మీనరసింహుడు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.